
# మంగమ్మగారు మంత్రిగారితో విందు

"అత్తయ్యా! మన మాజీ ముఖ్యమంత్రిగారు అమెరికా వచ్చారు. ఆయనగారి మీద మీకు చాలా గౌరవం కదండీ! పక్కనేవున్న 'శాన్‌హొసె'లో హిందూ కమ్యూనిటీ సెంటర్లో మీటింగు వుందట రేపు. మన తెలుగు వాళ్ళందర్నీ కలిసి, మాట్లాడాలని వస్తున్నార్ట." అంటూ కొత్త కబురు మోసుకు వచ్చాడు మంగమ్మగారి అల్లుడు.



"నిజంగానా? నాకు ఆయనను ముఖాముఖి చూడాలని ఎన్నాళ్ళ నుండో ఆశ. మా స్నేహితురాలు వాగీశ్వరి వాదెళ్ళ ఒకసారి మంత్రిగారితో మాట్లాడి మరీ వద్దామని మీటింగుకు తీసుకు వెళ్ళిందిగానీ వేల జనాల మధ్య మమ్మల్ని ముందుకు పోనివ్వలేదు పోలీసులు. ఇంతకీ రేపు మనం ఆయనగార్ని చూడ్డానికి వీలవుతుందా?" చిన్న పిల్లలా సంబరపడిపోతూ అడిగారు మంగమ్మగారు.

"రేపు శనివారంగదా అత్తయ్యా.. సెలవే... తప్పకుండా వెళ్దాం. భోజనాలు కూడా ఏర్పాటు చేస్తున్నార్ట గుళ్ళో... అక్కడే తినేసి వచ్చేయ వచ్చును. నమ్మకంగా చెప్పాడు అల్లుడు.

ఆ రాత్రి చాల సేపటిదాకా మర్నాడు ఏం చీర కట్టుకోవాలి. ఒకవేళ మంత్రిగారితో ఫోటో దిగితే ఇండియా వెళ్ళాక ఆ ఫోటో చూపించి అందరికీ ఎంతగొప్పగా చెప్పాలి అని ఆలోచనలే ఆవిడ మనసులో మెదలుతూ నిద్రపోలేకపోయింది.

"వచ్చేది అమెరికా కదా! అందరూ ఫాషనబుల్‌గా, నాజూకు చీరలు నగలు పెట్టుకుంటారని పెద్ద జరీ బార్డరు చీరెలు, పట్టు చీరలు తెచ్చుకోకుండా అన్నీ సింపుల్‌గా వుండేవి తీసుకు వచ్చాను. బుజ్జీ నడిగి పట్టుచీరె ఇప్పించుకుని కట్టుకుంటే సరిపోతుంది." అనుకుని ఎలాగో సర్దుకుంది మనసును.

నిద్రపోయే ముందు ఆవిడ మనసులో వాగీశ్వరి వాదెళ్ళ మాటలు మెదిలాయి. "ఆయన గారికి అంత కావాల్సిన మనిషి తనకు స్నేహితురాలు కదా! తనకు ఆ మాత్రం స్పెషల్ ట్రీట్‌మెంటు దొరకదా ఏమిటి? ఈ దెబ్బకు మామా అల్లుళ్ళిద్దరూ తన పరపతి ఏమిటో గ్రహిస్తారు" అనుకుంటూ ఎప్పటికో నిద్రపోయిందావిడ.

మర్నాడు తొందరగానే బయల్దేరి వెళ్ళారు మీటింగుకి ముందు వరుసలో కూర్చోవచ్చునని. తన మనసులో వున్న ప్లాన్ ఎవరికీ చెప్పలేదు మంగమ్మగారు.

ఎంత ముందుగా వెళ్ళినా మొదటి వరుసులు నాలుగూ నిండిపోవడాన అయిదో వరుసలో కూర్చున్నారు మంగమ్మగారి కుటుంబం.

తను పట్టు చీరె కట్టుకుని రావడమే కాక మానవరాలిని పట్టులంగాలో ముస్తాబుచేసి తీసుకువచ్చిందావిడ. మంత్రిగారితో దిగిన ఫోటోలు స్నేహితులకి చూపించేటప్పుడు కాస్త గ్రాండుగా వుండాలికదా అన్న ఆలోచనతో.

అన్న ప్రకారం ఆరుగంటలకల్లా మంత్రిగారు విచ్చేశారు. ఆయన సభాసదులకు నమస్కారంచేసి విజయ సంకేతంగా చేయిపైకెత్తి 'వి' గుర్తు చూపగానే హాలంతా చప్పట్లతో దద్దరిల్లింది.

తనకు అలవాటైన పంథాలో ఆయన తెలుగు తమ్ముళ్ళను, ఆడబడుచులను ఉద్దేశిస్తూ ప్రసంగం మొదలు పెట్టారు. మధ్యలో అలవాటుగా చూపుడు వేలు చూపిస్తూ ఒకే రకమైన టోన్‌లో మాట్లాడుతూ అందరి వైపూ నిశితంగా చూస్తున్నారు.

మంత్రిగారి దృష్టి తనమీద పడినప్పుడల్లా పరిచయం వున్న మనిషిలా చిరునవ్వు చిందిస్తున్నారు మంగమ్మగారు. అవును మరి వాగీశ్వరి వాదెళ్ళ ద్వారా ఆయన గురించీ, కుటుంబం గురించీ ఎన్ని విశేషాలు విన్నదావిడ!

మంత్రిగారి ఉపన్యాసం ముగియగానే ఆయనకు సన్మాన సత్కారాలు, అభినందనలు అందించారు ఆయన ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎన్.ఆర్.ఐ. తమ్ముళ్ళు. అసలు హడావుడి ఆ తరువాత మొదలయింది. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశామని తృప్తిగా తిని వెళ్ళాలనీ స్వయంగా మాజీ ముఖ్యమంత్రిగారే చెప్పాక బాగుండదన్నట్టు హాల్లో వెనకగా కూర్చున్న వారంతా ఒక్కుమ్మడిగా డైనింగుహాలు వైపు దారితీశారు.

మంత్రిగారు వెళ్ళడానికి లేవగానే ముందు వరుసలో వాళ్ళు ఆయన దగ్గరగా వెళ్ళి మాట్లాడాలని, కరచాలనం చేయాలని ముందుకు తోసుకు రావడం మొదలు పెట్టారు.

అయినా మంగమ్మగారు ఎలాగో అంతమంది మధ్యలో నుండి దూరి ముందుకు వెళ్ళి ఆయనకు దగ్గరగా వెళ్ళి నిలబడింది.

ఎవరితోనో మాట్లాడతున్న మంత్రిగారు దగ్గరగా వచ్చిన ఆవిడవైపు యథాలాపంగా చూశారు.

"నమస్కారమండీ... మాది కర్నూలు. మీ దగ్గరి బంధువు వాగీశ్వరి వాదెళ్ళ నాకు చాల దగ్గరి స్నేహితురాలు. మిమ్మల్ని ఇండియాలోనే పరిచయం చేస్తానందిగానీ వీలుపడలేదు. అప్పుడు మీరు ముఖ్యమంత్రిగా వున్నారు. ఎక్కడికెళ్ళినా జనం. ఇలా అమెరికాలో మిమ్మల్ని కలుస్తానని కలలోకూడ అనుకోలేదు." అంటూ గుక్కతిప్పుకోవడానికి కాస్త ఆగారు మంగమ్మగారు. తప్పించుకునే మార్గం కోసం చూస్తున్నారు మంత్రిగారు. అంతలో కూతుర్ని, అల్లుడిని, మంగపతిగారిని మాజీ ముఖ్యమంత్రిగారికి పరిచయం చేయాలని గుర్తొచ్చి వాళ్ళవైపు చూసి దగ్గరకు రమ్మన్నట్టుగా సైగలు చేసిందావిడ.

వాళ్ళు ఎలాగో త్రోసుకుంటూ ముందుకురాగానే "మావారు, మా అమ్మాయి బుజ్జి, అల్లుడు, వాళ్ళ పాప" అంటూ పరిచయం చేసిందావిడ.

అంతలోనే 'ఫోటో' తీయమంటూ అల్లుడికి సైగచేసి చెప్పింది. అతడు తన కేమ్‌కార్డర్‌ని పక్కనున్న వ్యక్తికి అందించి తమందరిని మాజీ ముఖ్యమంత్రిగారితో ఫోటోలు తీయమని రిక్వెస్ట్‌చేసి బుజ్జి పక్కన కూతుర్ని ఎత్తుకుని నిలబడ్డాడు.

"మా వాగీశ్వరి ఎప్పుడూ చెప్తుందండీ! మీ మీద అభిమానంతో వచ్చిన వారికి భోజనం పెట్టకుండా పంపరు మీరని. ఇంతమందికి భోజనాలు ఏర్పాటు చేశారు అమెరికాలోకూడా. మీరేమీ అనుకోకుంటే మేమూ మీతోబాటే తింటాము. మా వాగీశ్వరికి చెప్తాను నువ్వన్న మాట నిజమే అని" అంటూ నవ్వులు చిందించారు మంగమ్మగారు ఫోటో కోసం.

తప్పించుకోడానికి దారి దొరకని మంత్రిగారు "మా భోజనం మరొక చోట ఏర్పాటు చేశారు. మీరు అక్కడికేరండి..." అంటూ! పక్కనున్న పి.ఎ. వైపు చూశారు.

ఆ ఫైవ్‌స్టార్ హోటల్లో మంత్రిగారితో విందుకు వచ్చిన వారంతా తలకు రెండువందల డాలర్లు కట్టినవాళ్ళే. ఒక్క డాలరు ఖర్చులేకుండా మంత్రిగారితో విందారగించి ఇంటికి తిరిగి వస్తుంటే మంగమ్మ గారికి కొండెక్కినంత ఆనందంగా వుంది.

మంగమ్మగారంటే తమాషాలు పట్టించే బుజ్జీ, బుజ్జి మొగుడు, మంగపతిగారు కూడా ఆవిడ చాతుర్యం, దక్షతచూసి అదిరిపోయారులా వుంది ఆవిడ వైపు క్రొత్తగా చూస్తున్నారు.

'అమ్మా!' అంటూ బుజ్జీ, 'ఏమోయ్' అంటూ మంగపతిగారు ఒకేసారి పిలవడంతో ఉలిక్కిపడ్డారు మంగమ్మగారు.

మరొకసారి అదే కోరస్ వినబడడంతో నెమ్మదిగా కళ్ళు తెరిచిందావిడ.

"ఏంటమ్మా ఎప్పుడూ లేనిది ఇంతసేపు నిద్రపోతున్నావు?" అంటూ బుజ్జి.

"టైము తొమ్మిదయింది తెలుసా. రెండోసారి కాఫీ తాగే వేళయింది." అంటూ మంగపతిగారూ సుప్రభాతం ఆలపించారు.

అయోమయంగా వాళ్ళిద్దరివైపూ చూశారావిడ. 'అయితే ఇదంతా కలా? మాజీ ముఖ్యమంత్రిగారితో మాట్లాడ్డం, ఫోటోలు దిగడం, ఫైవ్‌స్టార్

హోటల్లో రెండు వందల డాలర్ల విందు అంతా ఉత్తదేనా…" అనుకుంటూ లేచి కూర్చున్నదామె.

"అమ్మా మనం వంట, భోజనం తొందరగా ముగిస్తే మూడింటికల్లా బయల్దేరవచ్చు శాన్‌హొసెకు. మీ అల్లుడి స్నేహితుడొకతను అక్కడ వున్నాడు. వాళ్ళింటికి వెళ్ళి అందరం కలిసి గుడికి వెడదాం!" అంది బుజ్జి హడావుడిగా వంటింట్లోకి వెడుతూ.

"సరే! మీటింగుకంటూ వెడుతున్నాం గనుక జరగబోయేది ముందుగా కలవొచ్చిందన్నమాట' అనుకుంటూ లేచి పనిలో పడ్డారు మంగమ్మగారు.

***

అనుకున్నట్టుగానే కాస్త తొందరగా బయల్దేరి అల్లుడి స్నేహితుడింటికి వెళ్ళారు.

అక్కడ కాసేపు గడిపి అంతా గుడికి దారి తీశారు.

ఆరుగంటలకు మీటింగు మొదలవుతుందని అంటే నాలుగున్నరకే జనం కిట కిటలాడిపోతున్నారు. అప్పటికే హాలు ఇంచుమించు నిండి పోయింది.

మంగమ్మగారు చొఱవగా ఎవరో నాలుగు కుర్చీల మీద ఒక తువ్వాలు పరిచి పెడితే ఆ తువ్వాలు అవతలకు జరిపేసి తనుకూర్చుని, మిగతావాళ్ళనీ కూర్చోమన్నారు.

అదిగో శాన్‌ఫ్రాన్సిస్‌కోలో బయల్దేరారుట… ఇదిగో శాంటక్లారాకి వచ్చార్ట. కాసేపట్లో ఇక్కడికి వచ్చేస్తున్నార్ట. అంటూ కబుర్లు అందుతూనే వున్నాయి జనానికి.

టైము చూస్తే ఎనిమిది దాటుతోంది. అందరూ వెళ్ళి భోజనాలు చేసి వచ్చేయమని విజ్ఞప్తి చేశారు సభా నిర్వాహకులు.

ఫైవ్‌స్టార్ హోటల్లో మాజీ ముఖ్యమంత్రితో డిన్నర్ మాట ఎటున్నా, ఇక్కడ భోజనం కాస్తా అయిపోతే ఇంటికి వెళ్ళి వండుకోవాలి అనుకుంటూ కూతురితోబాటు డైనింగు హాలుకి వెళ్ళారు మంగమ్మగారు.

వెళ్ళిన వాళ్ళకల్లా ఒక డబ్బా అందిస్తున్నారు డైనింగ్ హాల్లో. తెరచి చూస్తే గుప్పెడు పులిహోర, అంత పెరుగన్నం, రెండు స్పూన్ల కేసరీబాత్ వున్నాయి ఆ ప్లాస్టిక్ డబ్బాలో.

సరే అదే ప్రాప్తం అనుకుని విందు ముగించి మళ్ళీ మీటింగ్ జరిగే హాల్లోకి వచ్చారు.

ఈసారి మంగమ్మగారు తమ కుర్చీలమీద పరచి వచ్చిన శాలువాను పక్కన పెట్టేసి మరెవరో ఆ కుర్చీలలో ఆశీనులయ్యారు.

మరికాస్త వెనకి వెళ్ళాక ఎలాగో నాలుగు కుర్చీలు కనబడితే ఆడవాళ్ళు కూర్చున్నారు. మంగపతిగారు, బుజ్జి మొగుడు, అతడి స్నేహితుడు బయట తిరుగుతున్నారు మాజీ ముఖ్యమంత్రిగారి రాక గురించి కబురేమైనా తెలుస్తుందేమో అని.

ఇంత పొడుగు, అంతలావు వుండి తెల్లని దైత్యులలావున్న ఆడ మగ కాప్స్ అందర్నీ డేగకళ్ళతో గమనిస్తూ, మధ్యలో ఫోనులో మాట్లాడు తున్నారు.

టైము పది గంటలు కావస్తుండగా పాపకు విసుగొచ్చేసింది. "లెటజ్ గో హోమ్ మమ్మీ. అయామ్ స్లీపీ" అంటూ అమ్మ చున్నీని లాగడం మొదలు పెట్టింది.

"పోనీ వెళ్ళి పోదామా అమ్మా? ఇంటికి చేరేసరికి పదకొండు గంటలు దాటుతుంది." కూతుర్ని ఒళ్ళోకి తీసుకుంటూ అడిగింది బుజ్జి.

"తీరా ఇంత దూరం వచ్చి, ఇన్ని గంటలు వేచిచూసి ఆయన ముఖమన్నా చూడకుండా పోదామంటావేమిటే?" దిగులు పడ్డారు మంగమ్మగారు.

ఈ జనంలో ఆయన దగ్గరగా వెళ్ళడం, వాగీశ్వరి వాదెళ్ళతో తన పరిచయం గురించి చెప్పడం అసంభవమని ఆవిడకూ అనిపిస్తూనే వుంది.

అంతలో బుజ్జి భర్తా, మంగపతిగారూ వచ్చారు.

"పదండి అత్తయ్యా మాజీ సి.ఎమ్. గారి మాటలు వినే యోగం మనకు లేనట్టుంది. ఇంకా ఆలస్యమవుతుందట" అన్నాడు బుజ్జి మొగుడు.

అయిష్టంగానే లేచారు మంగమ్మగారు వాళ్ళు నలుగురూ అంత గుంపులోనుండి దారి చేసుకుని తలుపు దాకా వచ్చేసరికి హాల్లో వున్నట్టుండి కలకలం మొదలైంది.

సగం మంది జనం లేచి నిలబడ్డారు. అదిగో వచ్చేశారు మాజీ సి.ఎమ్." అనుకుంటూ.

కొందరు ఔత్సాహికులు ఈలలు వేశారు. మంగమ్మగారు గుమ్మం దగ్గరే ఆగిపోయారు.

ఇంతలో మాజీ సి.ఎమ్గారు వేదిక మీదకు వచ్చేసి, తనదైన పద్ధతిలో అభివాదంచేసి, తన స్వంత బాణీలో విక్టరీ సూచకంగా రెండు వేళ్ళతో 'వి' అక్షరం చూపే సరికి ఎన్నారైలలో యువత చప్పట్లు, కేకలు పెట్టారు.

"సోదర సోదరీమణులారా" అంటూ ఆయన గళం విప్పుతుండగానే "పదమ్మా.. మళ్ళీ అందరూ బయల్దేరారంటే కారు బయటకు తీయడానికే గంట పడుతుంది" అంటూ మంగమ్మగారి చేయిపట్టుకుని గబగబ బయటకు నడిచింది బుజ్జి.

ముప్పావుగంట గడిచాక ఇంటి దగ్గరకు వస్తుండగా అల్లుడు అన్నాడు" "అత్తయ్యగారు బాగా డిసప్పాయింట్ అయినట్టున్నారు. కాసేపు వుండి ఆయన ఉపన్యాసం విని బయల్దేర వలసింది" అని.

"నువ్వేంచేస్తావులే నాయనా! ఈసారి వాగీశ్వరి వాదెళ్ళకు చెప్తాను మీ బంధువుగారి పద్ధతేం బాగోలేదు. కనీసం అమెరికాలో అయినా చెప్పిన సమయానికి సమావేశాలకు హాజరు అయితే బాగుండేది అని. ఇండియాలో అయితే ఫరవాలేదు మన సమయ పాలన అందరికీ తెలుసు గనుక స్కూలు పిల్లలు స్పృహతప్పి పడిపోయినా, పోలీసుల కాళ్ళు పీకినా ఎవరూ ఏమీ అనరు. ఇక్కడా అలాగే చేస్తే మన పరువేం కావాలి?" కాస్త కోపంగా అన్నది మంగమ్మగారు.

"ఏదేశమేగినా మనం తెలుగువాళ్ళమేనోయ్" అన్నారు మంగపతి గారు నవ్వుతూ!